వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

తలమడుగు, నవంబర్ 12 : మండలంలోని పల్లి(బీ) గ్రామానికి చెందిన కుమ్ర శివకాంత్(19) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం జరిగింది. తరచూ మద్యం తాగుతుండడంపై శివకాంత్‌ను అతని బాబాయ్ మందలించాడు. దీంతో క్షణికా వేశంలో నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు వవెంటనే జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంజమ్మ తెలిపారు.

అలీగూడలో..

ఉట్నూర్ రూరల్, నవంబర్ 12: మండలంలోని అలీగూడలో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. ఎస్ఐ మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కొట్నాక్ చిన్ను(40)వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం తాగిన మైకంలో తన పంట చేనులో గుర్తు తెలియని పురుగుల మందు తాగి పడిపోయాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు వెతకగా పంట చేనులో వెతకగా అతని మృతదేహం కనిపించింది. మృతుడికి భార్య లక్ష్మీబాయి, ముగ్గురు పిల్లలున్నారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

ఎదులాపురం, నవంబర్ 12 : మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని మిస్టర్ టీ రెస్టారెంట్‌లో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్ తెలిపారు. మంగళవారం మావల పోలీస్‌స్టేషన్‌లో మావల ఏఎస్ఐ యూనుస్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ నెల 3న మిస్టర్ టీ రెస్టారెంట్‌లో కుంబోజు రాజేశ్, ఇతనికి సహకరించిన 17 సంవత్సరాల బాలుడు (ఇదే రెస్టారెంట్‌లో పనిచేస్తున్నాడు) రూ.15 వేలు దొంగలించారు. యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం కుంబోజు రాజేశ్‌ను అరెస్ట్ చేసి బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5050, రెండు సెల్ ఫోన్‌లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. కుంబోజు రాజేశ్‌ను రిమాండ్‌కు తరలించగా, బాలుడిని జువెనైల్ హోంకు పంపిస్తామని తెలిపారు. వ్యాపాలెవరూ దుకాణాల్లో కౌంటర్‌లో రాత్రిపూట డబ్బులు ఉంచి వెళ్లవద్దని రూరల్ సీఐ ఫణిధర్ సూచించారు. గత నెలలో సాగర్ సూపర్ మార్కెట్‌లో ఇలాంటి చోరీ జరిగిందని, రాత్రి పూట కౌంటర్లలో డబ్బులు ఉంచవద్దని తెలిపారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

ఎదులాపురం, నవంబర్12 : గిరిజనుల అభ్యున్నతితో పాటు వారిని క్రీడల్లో రాణించేలా వనవాసీ కల్యాణ పరిషత్ ప్రత్యేకంగా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నదని వనవాసీ కల్యాణ్ ఆశ్రమం దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి తాడేపల్లి శివరామకృష్ణ అన్నారు. భగవన్ బీర్సా ముండ జయంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో కబడ్డీ పోటీలను నిర్వహించారు. కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉష్కం రాఘుపతి, రాష్ట్ర పాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ ఆదివాసుల హక్కులతో పాటు దేశ స్వాతంత్ర్యం కోసం బీర్సాముండ పోరాడారని కొనియాడారు. గిరిజనులను క్రీడాల్లో ప్రోత్సహించేలా ప్రతి ఏటా పరిషత్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.విజేత జట్టుకు ప్రథమ బహుమతి రూ.10.016, రెండవ బహుమతి రూ.5.016 అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో వనవాసీ కల్యాణ పరిషత్ నాయకులు తొడసం అజయ్, మడావి మణిరావు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

నార్నూర్, నవంబర్12 : మండలంలోని మాన్కాపూర్‌లో గజానంద్‌శ్రీ జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు రితేశ్‌రాథోడ్, మాజీ ఎంపీపీ మెస్రం రూప్‌దేవ్ మంగళవారం ప్రారంభించారు. జిన్నింగ్‌కి మొదటి రోజు పత్తిని తీసుకొచ్చిన రైతులను శాలువాతో సన్మానించారు. క్వింటాల్ పత్తికి రూ.7521 చెల్లించారు. ఈ కార్యక్రమంలో సీపీవో నరేశ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవేందర్, నాయకులు జ్ఞానోబాపుష్కర్, రాథోడ్ బాబులాల్, చౌహాన్ యశ్వంత్, మాజీ సర్పంచ్ దిగంబర్ ఉన్నారు.

పోచమ్మ ఆలయంలో మహాభిషేకం

జైనథ్, నవంబర్ 12 : మండలంలోని ఆనంద్‌పూర్‌లో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయం పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆనంద్‌పూర్ పోచమ్మ విగ్రహానికి ప్రత్యేక అభిషేకం, కలశ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌పూర్ గ్రామ అర్చకులు సీహెచ్ పోతన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీలక్ష్మీ నారాయణుడి బ్రహ్మోత్సవాలు

జైనథ్, నవంబర్ 12 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి 18 కిలో మీటర్ల దూరంలో ఉన్న జైనథ్ మండలకేంద్రంలోని ప్రాచీన ఆలయమైన శ్రీలక్ష్మీ నారాయణ స్వామి కార్తీక ఏకదాశిని పురస్కరించుకొని బుధవారం నుంచి బహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయాన్ని అలంకరించి, ఈ నెల 20వ తేదీ వరకు ప్రత్యేక పూజలకు ఏర్పాటు చేసినట్లు ఈవో పెండెల వామన్‌రావ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలతోపాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలి

ఉట్నూర్ రూరల్, నవంబర్ 12: మండల కేంద్రలోని కేబీ కాంపెక్స్‌లో గల బీఈడీ కళాశాలలో అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ పీవోకు వినతి పత్రం అందించారు. బీఈడీ కళాశాలలో ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్, అధ్యాపక పోస్టులు, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి తొడసం భీంరావు. కార్యదర్శి మడావి నాగోరావు తదితరులున్నారు

నేడు పెన్‌గంగలో లక్షదీపార్చన

భీంపూర్, నవంబర్12: భీంపూర్ మండలం వడూర్ పెన్‌గంగ తీరంలో బుధవారం సాయంత్రం నుంచి లక్ష దీపార్చన నిర్వహించనున్నారు. తర్వాత రాత్రి వడూర్‌లో మహారాష్ట్ర చినార్లి గ్రామం కళాకారులు మోహిని, రుక్మాంగద నాటకం ప్రదర్శించనున్నారు. శివానంద భారతి స్వామి ఆధ్వర్యంలో పూజలు చేయనున్నట్లు తెలిపారు.

మండల వ్యవసాయాధికారిగా సాయితేజ

బేల, నవంబర్ 12 : మండలం వ్యవసాయ శాఖాధికారిగా సాయితేజ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది పూలమాల శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు రాజు, రమణ, నగేశ్, ఉమర్ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధురాలు

ఎదులాపురం, నవంబర్ 12 : ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలో వాఘాపూర్ శివారులో రోడ్డు పక్కన పడి ఉన్న వృద్ధురాలిని రిమ్స్ దవాఖాన వైద్యులు, సిబ్బంది, సఖీ కేంద్రం నిర్వాహకులు మంగళవారం కుటుంబసభ్యులకు అప్పగించారు. గత నెల 9న వాఘాపూర్ శివారులో రోడ్డు పక్కన పడి ఉన్న వృద్ధురాని గమనించిన స్థానికులు 108కి సమాచారం అందించగా ఆమను రిమ్స్ దవాఖానలో చేర్పించారు. రిమ్స్ వైద్యులు, సిబ్బంది నెల పాటు చికిత్స అందించారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ జిల్లా సంక్షేమ శాఖ అధికారికి సమచారం అందించారు. సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి తక్షణమే అక్కడికి వెళ్లి వృద్ధురాలితో మాట్లాడింది. తన పేరు సరోజ అని... దుబ్బాల గ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెప్పింది. భూపాలపల్లి జిల్లా సఖీ కేంద్రం నిర్వాహకురాలు గాయత్రికి పంపించారు. వెంటనే పోలీసుల ద్వారా కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకున్నారు. తల్లి(సరోజ) కొడుకు రమేశ్, కోడలు కవిత మంచిర్యాల జిల్లాలో ఉంటున్నారు. రాఖీపౌర్ణమి రోజున వృద్ధురాలు ఇంటి నుంచి వెళ్లిపోయింది. కొడుకు రమేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కొడుకు రమేశ్, కోడలు కవిత వచ్చి మంగళవారం రిమ్స్‌కు వచ్చి డైరెక్టర్‌తో మాట్లాడి..వృద్ధురాలిని వారు తీసుకువెళ్లారు. వృద్ధురాలిని క్షేమంగా అప్పగించినందుకు అధికారులు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి రిమాండ్

ఎదులాపురం, నవంబర్ 12 : అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో ఒకరిపై కత్తి, కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన ఆదిలాబాద్ జిల్లా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఆదిలాబాద్ పట్టణంలోని తిరుపెల్లికు చెందిన షఫీర్ ఖాన్, చున్నుఖాన్, మహాలక్ష్మి వాడకు చెందిన ఎండీ అక్బర్, శాంతినగర్‌కు చెందిన అబ్దుల్ మోహిన్ స్నేహితులు ఉన్నారు. అబ్దుల్ మోహిన్ షఫీర్ ఖాన్‌కు చెందిన బంధువుతో అక్రమ సంబంధం ఉందని అనుమానంతో కొద్ది రోజుల కిందట గొడవలు జరిగాయి. ఈ క్రమంలోనే ఈ నెల 10న రాత్రి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చాంద సమీపంలోని రుద్ర దాబాలో అబ్దుల్ మోహిన్ ఉన్నాడని తెలుసుకున్న షఫీర్ ఖాన్, చున్ను ఖాన్, ఎండీ అక్బర్ అక్కడికి చేరుకున్నారు. మద్యమత్తులో ఉన్న మోహిన్‌పై కత్తితో చేయి, భుజం, కంటి వద్ద తీవ్రంగా గాయపరిచి, కర్రతో కొట్టి పారిపోయారు. దీంతో స్థానికులు 108 అంబులెన్స్, పోలీసులకు సమాచారం అందించగా దవాఖానలో చేర్పించారు. మోహిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మంగళవారం చాంద సమీపంలో కేసులో ఏ1 ఉన్న షఫీర్ ఖాన్, ఏ2 చున్నుఖాన్, ఏ3 ఎండీ అక్బర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్ఐ ముజాహిద్ తెలిపారు. వారి వద్ద నుంచి కత్తి, కర్ర స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఏ1 షఫీర్ ఖాన్‌పై ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సుమారు 10 కేసులతోపాటు హత్యాయత్నం, దాడి కేసులు, రౌడీ షీటర్ కేసులున్నాయని తెలిపారు.

ఇద్దరు మట్కా నిర్వాహకుల అరెస్ట్

ఎదులాపురం, నవంబర్ 12 : ఇద్దరు మట్కా నిర్వాహకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ సీఐ బీ.సునీల్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓల్డ్ బస్ స్టాండ్ వద్ద శాంతినగర్‌కు చెందిన ఎండీ ఖయ్యూం, బంగారిగూడకు చెందిన జాదవ్ సంజు మట్కా ఆడుతున్న క్రమంలో వారిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.1100, మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకున్నామని సీఐ సునీల్‌కుమార్ పేర్కొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

• ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య

ఉట్నూర్ రూరల్, నవంబర్ 12: వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి, ఇంటర్మీడియట్ విద్యా శాఖ కార్యదర్శి కృష్ణ ఆదిత్య అన్నారు. మంగళవారం మండలంలోని బిర్సాయిపేట్, దంతన్‌పెల్లి గ్రామాల్లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవ్యాతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా బిర్సాయిపేట్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వెంట వెంటనే వరి ధాన్యాన్ని కొనాలని, రైతులకు ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం దంతన్‌పల్లి లో

అధికారులతో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య

అధికారులు చేపడుతున్న కుటుంబ సర్వేను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. సర్వేలో గ్రామాల్లోని ప్రతి కుటుంబ వివరాలు ప్రతి ఒక్కటి నమోదు చేసి సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా సర్వేలో ఏమైనా సమస్యలు ఏర్పడినప్పుడు ఉన్నతాధికారులు సలహా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో సాయన్న, మండల ప్రత్యేక అధికారి సుధాకర్, ఎంపీడీవో రాంప్రసాద్, ఎంపీవో మహేష్, సూపర్‌వైజర్ విజేశ్, పంచాయతీ కార్యదర్శి అరవింద్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తేమ పేరుతో పత్తి ధర తగ్గించొద్దు

• రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగేపు బొర్రన్న

బోథ్, నవంబర్ 12 : పత్తి కొనుగోళ్లలో తేమ శాతాన్ని మినహాంచి మద్దతు ధర కల్పించాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగేపు బొర్రన్న అన్నారు. మంగళవారం బోథ్‌లోని జిన్నింగ్ ఫ్యాక్టరీలో రైతులు తీసుకుచ్చిన పత్తి పంటను పరిశీలించారు. తేమ శాతం ఎక్కువగా ఉందంటూ ధర తగ్గించడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. తేమ శాతాన్ని సడలింపు ఇచ్చిన రైతులకు ఆర్థిక తోడ్పాటు అందించాలన్నారు. ఇప్పటి వరకు సీసీఐ 59704 క్వింటాళ్లు, ప్రైవేట్ వ్యాపారులు 78510 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు తెలిపారు. సీసీఐ కంటే ప్రైవేట్ వ్యాపారులే పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు చంద్రకాంత్, రాములు, అశోక్ బషీర్ పాల్గొన్నారు.

పత్తిని పరిశీలిస్తున్న జిల్లా అధ్యక్షుడు సంగేపు బొర్రన్న

మాట్లాడుతున్న డీఎఫ్‌వో ప్రశాంత్ పాటిల్ బాజీరావ్

అడవుల రక్షణ అందరి బాధ్యత

• డీఎఫ్‌వో ప్రశాంత్ పాటిల్ బాజీరావ్

బజార్‌హత్నూర్, నవంబర్ 12 :అడవులను సంరక్షించి జీవ వైవిధ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని డీఎఫ్‌వో ప్రశాంత్ పాటిల్ బాజీరావ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని డేడ్ర, గిరిజాయి అటవీ ప్రాంతంలో పర్యటించారు. అటవీ ప్రాంతంలో అటవీ జంతువుల దాహం తీర్చేందుకు ఏర్పాటు చేసిన సాసర్ పీట్లను పరిశీలించారు. కలప స్మగ్లింగ్, వన్యప్రాణుల వేటకు పాల్పడవద్దని గ్రామస్తులకు సూచించారు. పంట చేన్లకు సాగునీటి కోసం బోర్ వెల్స్ కోసం అనుమతి, డేడ్ర, మాన్కపూర్, గిరిజాయి, ఉమార్ల గ్రామాలకు బీటీ రోడ్డు మంజూరయ్యాయని, అటవీ శాఖ అనుమతి ఇవ్వాలని గ్రామస్తులు కోరారు. దీంతో ఉన్నత స్థాయిలో మాట్లాడి త్వరగా అనుమతులు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో పుండలిక్, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో ప్రవీణ్ మహాజన్, బీట్ ఆఫీసర్లు ఈశ్వర్, కేశవ్, తిరుపతి, రాజు, జంగు, సంబాజీ, విశ్వనాథ్, గ్రామ పటేల్ లింగు, భీంరావ్ పాల్గొన్నారు.

రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలి -

రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ గౌష్ ఆలం

బేల, నవంబర్ 12 : కేసులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలని ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఐపీఎస్ మంగళవారం సాయంత్రం పోలీస్ స్టేషన్ పరిశీలించారు. జైనథ్ సీఐ డీ సాయినాథ్ ఎస్పీకి పూల మొక్క అందించి స్వాగతం పలికారు. సిబ్బంది ద్వారా ఏర్పాటు చేసిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. పోలీస్ స్టేషన్‌లో పచ్చదనం, పరిశుభ్రత, రిసెప్షన్, లాకప్, రికార్డులు భద్రపరిచే గది, సాక్ష్యధారాలను భద్రపరిచే గది, సిబ్బంది వేచి ఉండే ప్రదేశం, పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశీలించి బేల ఎస్ఐ రాధికకు సూచనలు చేశారు. కేసుల వివరాలు తెలుసుకొని పలు సూచనలు చేశారు. సరిహద్దు వెంబడి గస్తీ నిర్వహిస్తూ నిఘా ఉంచాలని తెలిపారు.

ప్రభుత్వ దవాఖానలో విచారణ

విచారణ చేస్తున్న డీసీహెచ్ఎస్ శ్రీనివాస్ ప్రసాద్

ఖానాపూర్ టౌన్, నవంబర్ 12 ః గత ఆగస్టు 9న ఖానాపూర్ దవాఖానలో రోగికి గడువు తీరిన సెలైన్ ఎక్కించిన ఘటనలో వైద్య విధాన పరిషత్ కమిషనర్ అదేశాల మేరకు ఖానాపూర్ దవాఖానలో మంగళవారం విచారణ అధికారి నిజామాబాద్ డీసీహెచ్ఎస్ శ్రీనివాస్ ప్రసాద్ విచారణ జరిపారు. ఇది వరకే ఈ ఘటనలో ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేయడంతో పాటు ఐదుగురు ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. విచారణలో భాగంగా సూపరింటెండెంట్, పార్మాసిస్టులు, వైద్య సిబ్బందితో పాటు ఇది వరకే సస్పెండ్‌కు గురైన ఉద్యోగులను విచారించారు. పూర్తి నివేదికను త్వరలోనే ఉన్నతాధికారులకు అందజేస్తామని విచారణ అధికారి నిజామాబాద్ డీసీహెచ్ఎస్‌శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. ఏవో కృష్ణవేణి, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

సద్గురు పూలాజీబాబా చూపిన మార్గంలో నడవాలి

పూలాజీబాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి, నవంబర్12 : పరమహంస సద్గురు పూలాజీబాబా చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పూలాజీబాబా సంస్థన్ ట్రస్ట్ చైర్మన్ ఇంగ్లే కేశవ్ అన్నారు. మంగళవారం ఇంద్రవెల్లి మండలంలోని మామిడిగూడలోని పూలాజీబాబా ధ్యానకేంద్రంలో 25వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలాజీబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుడే కైలాస్, గ్రామపటేల్ శ్యాంరావ్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు ముకాడే ఉత్తం, ఆంధ్ ఆదివాసీ సమాజ్ పెద్దలు డాకురే రాందాస్, కరాడే మారుతి, తిరుపతి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కార్గో డోర్ డెలివరీ సర్వీసును వినియోగించుకోండి

ఎదులాపురం, నవంబర్12: ఇటీవల హైదరాబాద్ , సిక్రిందరాబాద్‌లో కార్గో డోర్‌డెలవరీ సర్వీసును ప్రారంభించరని ఆదిలాబాద్ రీజియన్ కార్గో అధికారి బీ పాల్ తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి మంగళవారం పట్టణంలో డోర్ డెలివరీ సర్వీసుపై ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలోని ప్రధాన విధుల గుండా అవగాహన ర్యాలీ చేపట్టారు. వస్తువులను నేరుగా ఇంటివద్దకే పంపించాలనుకుంటే, హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని 31 ఆర్టీసీ కార్గో కౌంటర్స్‌లకు పంపించవచ్చన్నారు. ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదిలాబాద్, ఉట్నూర్ డిపో 9154298531, 9154298533కి సంప్రదించాలన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

తాంసి, నవంబర్ 12 : విద్యార్థులు కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చని డీఐఈవో రవీందర్ అన్నారు. తాంసి కళాశాలలో చదువుకొని 11 మంది ఏఎన్ఎం ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను సన్మానించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

15న బాసరలో కార్తీక పౌర్ణమి ఉత్సవాలు

బాసర, నవంబరు 12 : బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో ఈ నెల 15న కార్తీక పౌర్ణమి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు మంగళవారం ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఉత్సవాలకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మంగళవారం గోదావరి పుష్కరఘాట్ వద్ద కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు.

పులి దాడిలో గాయపడ్డ ఆవు మృతి

కుంటాల, నవంబర్ 12: మండలంలోని కొన్ని రోజులుగా పెద్ద పులి సంచారం చేస్తూ అడవుల్లో పలు పశువులపై దాడి చేసింది. వారం క్రితం అంబుగాం అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన పశువుల మందలోని ఒక ఆవుపై దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. పులి దాడితో ఆవు మెడ, కాలుపై అయిన గాయాలతో మంగళవారం మృతి చెందిందని యజమాని సుదర్శన్ పటేల్ తెలిపారు. దాని విలువ రూ.50 వేలు ఉంటుందని ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని విన్నవించాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఇంద్రవెల్లి, నవంబర్ 12 : మండలంలోని ఈశ్వర్‌నగర్–నర్సాపూర్ ఎక్స్‌రోడ్డు సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఉట్నూర్ మండలం ఉమ్రి గ్రామానికి చెందిన రవీందర్‌కు తీవ్రగాయాలయ్యాయని ఎస్ఐ దుబ్బాక సునీల్ తెలిపారు. గుడిహత్నూర్ నుంచి ఉట్నూర్‌కు బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఒకరు అక్కడిక్కడే మృతిచెందారు. రవీందర్‌కు తీవ్రగాయాలవగా, ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. మృతిచెందిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఆశ్రమ విద్యార్థి

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 12: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు నిర్మల్ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి 8వ తరగతి విద్యార్థి బీ.కృష్ణ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనూష తెలిపారు. ఈ నెల 16, 17 తేదీల్లో మెదక్ జిల్లా చేగుంటలో పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపికవడంపై ఐటీడీఏ పీవో, డీటీడీవో, ఏసీఎంవో, పీడీ భూక్యా రమేశ్, తదితరులు అభినందించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సోన్, నవంబర్ 12 : నిర్మల్ మండలంలోని ముఠాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఎల్లపెల్లి, ముఠాపూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ బోండ్ల గంగాధర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజారెడ్డి, డైరెక్టర్లు గంగాధర్, నారాయణ, నవీన్, గాండ్ల నవీన్, నారాయణ, భరత్, రాము, బొడ్డు లింగన్న, పోశెట్టి, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, సీఈవో వజీర్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను నమ్మితే మోసపోయినట్లే'

భైంసా, నవంబర్, 12 : కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేస్తే మోసపోయినట్లేనని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. మంగళవారం మహారాష్ట్రలోని రాటి, నాంద, రావణ్‌గావ్, మాతుల్‌తో పాటు పలు గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి తరపున ప్రచారం చేశారు. ఆరు గ్యారెంటీలతో పాటు 400ల పరకు హమీలిచ్చి నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నదని కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు అమర్ బహు రాజకర్, భైంసా మాజీ మున్సిపల్ చైర్మన్ బీ. గంగాధర్, కుంటాల మాజీ ఎంపీపీ రమణారావు, తదితరులు ఉన్నారు.

తెలంగాణలోని ప్రాపర్టీ అమ్మినా హామీలు నెరవేరవు..

కుభీర్, నవంబర్ 12 : తెలంగాణలోని ప్రాపర్టీ మొత్తాన్ని అమ్మినా కాంగ్రెస్ పార్టీ, రేవంత్ సర్కారు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేరని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మహారాష్ట్ర భోఖర్ తాలుకాలోని సరిహద్దు గ్రామాలైన పాలజ్, కీని, నెక్లి తదితర గ్రామాలలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయా చవాన్, ఎంపీ అభ్యర్థి డా.సంతుక్‌రావు అంబర్టే తరపున ప్రచారం చేశారు. సిగ్గు లేకుండా నిన్న ముంబైలో ఎన్నికల ప్రచారంలో హామీలు నెరవేర్చినమంటూ గొప్పలు చెప్పాడని ఎద్దేవా చేశారు. మరో సారి మహారాష్ట్ర ప్రజలకు మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఎద్దు యజమానికి పరిహారం

పెంబి, నవంబర్ 12: మండలంలోని అంకెన గ్రామంలో రైతు లక్ష్మీబాయికి చెందిన ఎద్దు ఎనిమిది నెలల క్